# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శుక్రవారం 13 జూన్ 2025 | HYDERABAD





గురువారం స్కూళ్లు పునఃప్రారంభమవ్వగా, కంటోన్మెంట్ అన్నానగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సందడి ఇది



నిర్వాసితుల అభ్యంతరాల మధ్య మాదాపూర్‌లోని సున్నం చెరువులో అధికారులు సిబ్బందితో కలిసి సర్వే నిర్వహించారు.



హరిచందన

## హైదరాబాద్ కలెక్టర్‌గా హరిచందన

సిటీ బ్యూరో: హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా హరిచందన దాసరిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ స్థానంలో కొనసాగిన అనుదీప్ దురిశెట్టిని ఖమ్మం కలెక్టర్‌గా బదిలీ చేశారు. మేడ్చల్ కలెక్టర్‌గా కొనసాగిన గౌతమ్‌ను సింగరేణి సంస్థ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఈ స్థానానికి మిక్కిలినేని మను చౌదరిని కలెక్టర్‌గా నియమించారు. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా కొనసాగిన స్నేహ శబరీష్‌ను హన్మకొండ జిల్లా కలెక్టర్‌గా, శివకుమార్ నాయుడును ఇరిగేషన్ శాఖలో భూసేకరణ విభాగం కమిషనర్‌గా నియమించారు. హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్‌గా పనిచేసిన శ్రీనివాస్‌ను బదిలీ చేస్తూ ఆయన స్థానంలో వీఎస్ఎన్వీ ప్రసాద్‌ను నియమించారు.



మేడ్చల్ కలెక్టర్‌గా మిక్కిలినేని మను చౌదరి

## ఆ నిధులను కూకట్‌పల్లికి కేటాయించండి

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ: కేపీహెచ్‌బీ కాలనీలో భూముల వేలం పాటలో వచ్చిన సొమ్ములో కొంతైనా కూకట్‌పల్లి నియోజకవర్గం అభివృద్ధికి కేటాయించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం హౌసింగ్ బోర్డ్ స్థలాల అమ్మకాలపై ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హౌసింగ్ బోర్డు భూములను కాపాడామన్నారు. కాలనీలు, బస్తీల్లో హౌసింగ్ బోర్డు ఖాళీ స్థలాలను ప్రజలకు ఉపయోగపడే పార్కులుగా క్రీడా ప్రాంగణాలుగా తీర్చిదిద్దామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే హౌసింగ్ బోర్డు స్థలాలను అమ్మకానికి పెట్టిందని, ప్రజలకు చెందిన స్థలాలను అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నదని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలోనే హౌసింగ్ బోర్డు స్థలాలను అమ్ముకొని రూ.3 వేల కోట్లను సేకరించారని... నేడు మళ్లీ అదే పందాలో భూములను అమ్ముతున్నదన్నారు. బీఆర్ఎస్ పార్టీ కాపాడితే... కాంగ్రెస్ పార్టీ అమ్ముకోవడం బాధాకరమన్నారు.



# చితికిపోతున్న చిరు వ్యాపారులు

- నగరంలో ఆన్‌లైన్ యాప్‌లు, మాల్‌ల దెబ్బకు వీధి వ్యాపారులు కుదేలు
- మూడేండ్లలో 50 శాతానికి పడిపోయిన అమ్మకాలు
- డిస్కౌంట్లు, స్పెషల్ ఆఫర్ల పేరిట ఆకర్షిస్తున్న ఈ-కామర్స్ సంస్థలు
- అద్దెలు చెల్లించలేకపోతున్నామని కిరాణా దుకాణదారుల ఆవేదన

సిటీ బ్యూరో, జూన్ 12 (నమస్తే తెలంగాణ): వీధి వ్యాపారులు, చిన్న చిన్న దుకాణాలు నిర్వహిస్తూ కుటుంబాలను పోషించుకునే చిరు వ్యాపారుల పాలిట క్విక్ కామర్స్ డెలివరీ సంస్థలు, షాపింగ్ మాల్స్ , సూపర్ మార్కెట్లు శాపంగా మారుతున్నాయి. ఆన్‌లైన్ డెలివరీలు, డిస్కౌంట్లతో మాల్స్, క్విక్ కామర్స్ సంస్థలు చూపే ఆశలతో కొనుగోళ్లు తగ్గిపోయి రోడ్ల వెంట, కాలనీల్లోని ఉండే పండ్లు, కూరగాయలు, కిరాణా దుకాణాలు వెలవెలబోతున్నాయి. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న క్విక్ కామర్స్ యాప్‌లు, సూపర్ మార్కెట్లు చిరు వ్యాపారులకు ఉపాధి లేకుండా చేస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో చిరు వ్యాపారాల మీదనే ఆధారపడి జీవించే వేలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అమ్మకాలు తగ్గడంతో కుటుంబ పోషణ భారంగా మారుతున్నదని వీధి వ్యాపారులు, చిన్న చిన్న దుకాణాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన మూడేండ్లుగా దుకాణాల అద్దెలు కూడా చెల్లించలేని దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. నగరంలో కరోనా మహమ్మారి సృష్టించిన అలజడికి ఇంటి అద్దెలతో పాటు అన్ని వస్తువుల ధరలు అమాంతం పెరిగాయి. ఆన్‌లైన్ సేవలు విస్తృతం కావడంతో అన్నింట్లోకి క్విక్ కామర్స్ సంస్థల డెలివరీ విధానం వచ్చింది.

మిగతా IIవ పేజీలో



ఫుట్‌పాత్‌పై చిరు వ్యాపారాలు



సింగరేణి కాలనీ వాంబే క్వార్టర్స్‌లో సీసీ రోడ్డు వేయకుండానే బిల్లులు తీసుకున్న మట్టి రోడ్డు

# వేయని రోడ్డుకు బిల్లు.. ఖజానాకు చిల్లు

## చేయని పనికి 9 లక్షలు మంజూరు

- సీసీ రోడ్డు వేయకుండానే డబ్బులు నొక్కేసిన ఏజెన్సీ
- విజిలెన్స్ విచారణలో భాగోతం బట్టబయలు
- విధుల నుంచి ఏఈ టర్మినేట్, ఈఈపై సస్పెన్షన్ వేటు
- కాంట్రాక్టర్ నుంచి నగదును రికవరీ చేయాలని కమిషనర్ ఆదేశం
- సీఎం రేవంత్ రెడ్డి శాఖలో తారస్థాయికి అవినీతి

IVలో

కాంట్రాక్టర్, ఇంజినీరు కలిసి బల్దియా ఖజానాకు కన్నం పెట్టారు. సీసీ రోడ్డు వేయకుండానే వేసినట్టుగా బిల్లులు పెట్టి దోచుకున్నారు.. చివరకు వీరి భాగోతం విజిలెన్స్ విచారణలో బట్టబయలైంది. క్వాలిటీ కంట్రోల్ విజిలెన్స్ నివేదిక ఆధారంగా కమిషనర్ ఆర్ వీ కర్ణన్ సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకుంటూ ఉత్తర్వులు జారీ చేశారు. జీహెచ్ఎంసీకి చెందిన ఏఈ అన్సారీని విధుల నుంచి టర్మినేట్ చేశారు. పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఈఈ ఏకాంబరంపై సస్పెన్షన్ వేటు వేస్తూ కమిషనర్ నిర్ణయం తీసుకున్నారు. సదరు కాంట్రాక్ట్ సంస్థ నుంచి రూ.8.93 లక్షలను రికవరీ చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు.

- సిటీబ్యూరో, జూన్ 12 (నమస్తే తెలంగాణ):

# ఒంటరి వృద్ధులకు రక్షణేదీ?

## వృద్ధులపై దారుణాలు..

### బిక్కుబిక్కుమంటున్న పండుటాకులు

### హైదరాబాద్‌లో వృద్ధుల రక్షణపై కలవరం

సిటీబ్యూరో, జూన్ 12(నమస్తే తెలంగాణ): వృద్ధులపై జరుగుతున్న దారుణాలతో వారు ఒంటరిగా ఇండ్లలో ఉండాలంటేనే బిక్కు బిక్కుమంటూ భయంతో గుడపాల్సిన పరిస్థితి నెలకొంటున్నది. నగరం నడిబొడ్డున, నగర శివార్లలోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో వృద్ధులకు రక్షణ లేకుండాపోతున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో చాలా మంది ఒంటరి వృద్ధులు ఉంటారు. పిల్లలు ఉద్యోగాల నిమిత్తం విదేశాలు, స్వదేశాల్లో ఉండడం, చాలా మంది ఒంటరిగానే ఉంటున్నారు. అసలే వారికి ఆరోగ్య పరమైన ఇబ్బందులతో ఆందోళనల్లో ఉంటుంటారు. అలాంటి వారిని అక్కున చేర్చుకోవాల్సిన సమాజంలోని కొందరు నేర స్వభావం కల్గిన వాళ్లు వారిపై అఘాయిత్యాలకు సైతం పాల్పడుతున్నారు. వృద్ధులపై నేరాలకు పాల్పడుతున్న వారిలో చాలా మంది తెలిసిన వాళ్లే ఉంటున్నారు. ఒంటరి వృద్ధుల హత్యలు.. లైంగికదాడి యత్నాలు... వృద్ధులను దోచుకోవడం... వారి వద్ద దొంగతనం చేయడం వంటి కేసులు తరచూ పోలీస్‌స్టేషన్లకు వస్తున్నాయి. వారి సొంత పనులు చేసుకునేందుకు వారిలో సత్తువ లేకుండా పోతున్న సమయంలో వారిపై దాడులు చేయడం సభ్యసమాజమే సిగ్గుపడాల్సిన పరిస్థితి. అయితే నేర స్వభావం ఉన్న వాళ్లు మద్యం, గంజాయి మత్తులోనూ ఈ దారుణాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడవుతున్నాయి. దీంతో పాటు వృద్ధులను లక్ష్యంగా చేసుకొని వారిని హత మార్చి ఆస్తులను కొట్టేయాలనే దుర్బిద్ధి కొందరిలో ఉంటుంది. ఇలా ఒక్కొక్కరూ ఒక్కో ఆలోచనతో వృద్ధులను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడడం ఆందోళన కల్గిస్తోంది. తాజాగా హైదరాబాద్ శివారులోని యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో 90 ఏండ్ల వృద్ధురాలిపై గంజాయి, మద్యం మత్తులో యువకులు లైంగికదాడికి యత్నించిన ఘటన తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఇలాంటి ఘటనలకు తావులేకుండా ఉండేందుకు పోలీసులు ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకొని, నిందితులను పట్టుకోవడం కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు.

### వృద్ధ దంపతులే టార్గెట్‌గా..!

అంబర్‌పేట్‌లో లింగారెడ్డి(80), ఆయన భార్య ఉర్మిళ(70)ని గత ఏడాది అక్టోబర్ నెలల్లో గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. ఇద్దరు వృద్ధ దంపతులే ఇంట్లో ఉంటారు. ఈ కేసులో నిందితులను ఇప్పటి వరకు పోలీసులు గుర్తించలేదు. ఈ కేసు మిస్టరీగానే మారిపోయింది. దోపిడీ దొంగతనం లక్ష్యంగా ఈ హత్య జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేసినా ఆ కోణంలో తగిన ఆధారాలు లభించలేదు. దీంతో ఆర్థికపరమైన, కుటుంబ పరమైన, ఇంకా ఇతరాత్ర వ్యవహారాలే ఈ హత్యకు దారి తీసి ఉంటాయనే

మిగతా IIవ పేజీలో



# పబ్‌లో గొడవ

## నటి కల్పికపై కేసు

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి పోలీసులు నటి కల్పికపై కేసు నమోదు చేశారు. ప్రిజం క్లబ్ యాజమాన్యం ఫిర్యాదు మేరకు సీసీటీవీ ఫుటేజ్ సాక్షాలు పరిశీలించిన పోలీసులు.. ఈ వ్యవహారంలో కల్పిక చర్యలు తీసుకునేందుకు కోర్టు అనుమతులతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ప్రిజం పబ్‌లో గత నెల 29న ప్రముఖ నటి కల్పిక మరో స్నేహితుడితో వెళ్లారు. రాత్రి పబ్ నిర్వాహకులు నటి కల్పిక తీసుకున్న ఆహారానికి సంబంధించి రూ. 2200 బిల్లును అక్కడి వెయిటర్ అందజేశారు. కాగా, తనకు చీజ్ కేక్ కావాలని అది కూడా బిల్లు లేకుండా కాంప్లిమెంటరీ ఇవ్వాలని పట్టుబట్టారు. బ్రౌనీని అందజేసిన తృప్తి చెందకుండా కల్పిక.. సదరు బ్రౌనీ ప్లేటును విసిరిపారేసి హంగామా చేశారు. పబ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సిబ్బందిని దుర్భషలాడుతూ గొడవకు దిగారు. పైగా క్లబ్ యాజమాన్యం తనతో అసభ్యంగా ప్రవర్తించారంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి అవమానించారు. ప్రిజం యాజమాన్యం మేనేజింగ్ పార్టనర్ దీపక్ బజాజ్ పోలీసులకు కల్పిక వివాదానికి సంబంధించి సీసీటీవీ ఫుటేజీ సాక్షాలతో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫిర్యాదును స్వీకరించి సాక్షాదారులను పరిశీలించి కోర్టు ఆదేశాలతో నటి కల్పికపై కేసు నమోదు చేశారు.





# రియల్ వెబ్‌సైట్‌లో గిరాకీ డల్

## ప్రాపర్టీ వెబ్‌సైట్లలలో 30 శాతం తగ్గిన లిస్టింగ్

సిటీబ్యూరో, జూన్ 12 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ కేంద్రంగా రియల్ ఎస్టేట్ డౌన్‌ఫాల్‌తో.. ఆ ప్రభావం అనుబంధ రంగాలపై కూడా పడుతోంది. ఇంటర్‌నెట్ విస్తృతంగా అందుబాటులోకి వచ్చిన తర్వాత వెబ్‌సైట్లలో వినియోగం విపరీతంగా పెరిగింది. గతంలో మాదిరి కస్టమర్ల కోసం వెతుక్కోవాల్సిన పని లేకుండా కూర్చొన్న చోటకే తీసుకువచ్చే రియాల్టీ వెబ్‌సైట్లకు ఆదరణ లేకుండా పోతున్నది. మార్కెట్‌లో క్రయవిక్రయాలు తగ్గిపోవడంతో.. ఓపెన్ ప్లాట్లు, రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాజెక్టుల లిస్టింగ్ నగరంలో క్రమంగా తగ్గుతుండగా.. గతేడాది మార్చి నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు వెబ్‌సైట్లలో నమోదయ్యే స్థిరాస్తుల సంఖ్య గణనీయంగా పడిపోతున్నది. ఒక్క ఏడాదిలోనే 30 శాతం లిస్టింగ్ పడిపోగా.. గడిచిన మూడు నెలలుగా పరిస్థితి మరింత దారుణంగా ఉందని నిర్వాహకులు వాపోతున్నారు.

### ప్రత్యక్షంగా.. పరోక్షంగా..

రియాల్టీ రంగంలో అమ్మకాలు పడిపోవడం ఎంతో మంది జీవనాధారంపై, మరెన్నో రంగాలకు ఉపాధి లేకుండా పోతున్నది. హైదరాబాద్ కేంద్రంగా 10లక్షల మందికిపైగా ఆధారపడి ఉన్న ఈ రియల్ ఎస్టేట్ రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవనోపాధి పొందుతుండగా.. మార్కెట్‌లో ప్రతికూల పరిస్థితులతో ఇబ్బందిగా

మిగతా IIవ పేజీలో



చందానగర్‌లో రహదారిపై వరద నీటిని తోడుతున్న దృశ్యం

# శేరిలింగంపల్లిలో 14.85 సెం.మీల వర్షం

## గ్రేటర్‌లో రెండ్రోజులు భారీ వర్షాలకు అవకాశం

సిటీబ్యూరో, జూన్ 12 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో బుధవారం అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు గ్రేటర్‌లోని పలు చోట్ల కుండపోత వాన కురిసింది. రాత్రి సమయంలో కురవడంతో జనానికి పెద్దగా ఇబ్బందులు తలెత్తలేదు. కానీ ఉదయం 8 గంటల వరకు వర్షం కురవడంతో తొలి రోజే పాఠశాలలకు వెళ్లిన విద్యార్థులు.. వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఉదయం సమయంలో పనులకు వెళ్లే వారి కొంత ఇబ్బందులు తప్పలేదు. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం 8.30 గంటల వరకు నగరంలోని శేరిలింగంపల్లి, హైదరాబాద్ యూనివర్సిటీ ప్రాంతంలో అత్యధికంగా 14.85 సెం.మీలు, చందానగర్‌లో 11 సెం.మీలు, గచ్చిబౌలిలో 8.13 సెం.మీలు, రాజేంద్రనగర్, హఫీజ్‌పేటలో 5.0 సెం.మీలు, మియాపూర్‌లో 4.63, చాంద్రాయణగుట్టలో 4.58 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. అయితే మొన్నటి వరకు అధిక ఉష్ణోగ్రతలతో వేడెక్కిన నగర వాతావరణం రెండు రోజులుగా కురుస్తున్న వానలతో కొంత చల్లబడింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 32.7, కనిష్ఠం 24.3 డిగ్రీలు, గాలిలో తేమ 64 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా, రుతుపవనాలు చురుకుగా కదలడం, బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తన ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశాలున్నట్లు అధికారులు వెల్లడించారు.



బండ్లగూడ జాగీర్‌లో ఓ విల్లాలోకి వచ్చిన వరద నీరు